# తొలివెలుగు

జాతీయ దిన పత్రిక

మన భాష.. మన పత్రిక..

https://tholivelugu.com/

హైదరాబాద్ సంపుటి:01 సంచిక: 59 11-3-2026 వెల: రూ.2/- పేజీలు: 06



విలేకరులు కావలెను

తొలివెలుగు జాతీయ దిన పత్రిక మన భాష.. మన పత్రిక..

www.epaper.tholivelugu.com


Contacts

తెలంగాణ

94911 34365

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో

తొలివెలుగు జాతీయ తెలుగు దినపత్రికలో పలు విభాగాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన స్టేట్ బ్యూరో, జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. ఆసక్తి.. అనుభవం గల వారు సంప్రదించగలరు.

## 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్

# హబ్'గా ఏపీ

- ఏపీ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ ఏర్పాటుకు సన్నాహాలు
- రాబోయే పదేళ్లలో రూ.50 వేల కోట్ల పెట్టుబడులు, 40 వేల ఉద్యోగాలే టార్గెట్
- శ్రీకాకుళం, అనకాపల్లి, మచిలీపట్నంలో 3 ప్రాసెసింగ్ పార్కుల ఏర్పాటుకు ప్రతిపాదన
- రాష్ట్రంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్‌పై ప్రత్యేక దృష్టి

ఆంధ్రప్రదేశ్‌ను 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా నిర్దేశించారు. ఇందుకు రాష్ట్ర తీరప్రాంతంలో లభించే విలువైన బీచ్ సాండ్ వంటి ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకోవాలని అధికారులను ఆదేశించారు. తద్వారా రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి కొత్త

2లో

## పాలనపై సీఎం చంద్రబాబు ఫోకస్...

- ఈ నెల 11, 12 తేదీల్లో కలెక్టర్ల సదస్సు
- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై సీఎం చంద్రబాబు సమీక్ష
- స్వర్ణాంధ్ర విజన్, సూపర్ సిక్స్ అమలుపై ప్రధానంగా చర్చ
- రెండో రోజు శాంతిభద్రతలపై ఎస్పీలతో ప్రత్యేక సమావేశం



## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

- దేవాలయాల విధ్వంసంపై వైసీపీ ఫేక్ ప్రచారం చేస్తోందన్న మంత్రి లోకేశ్
- కసాపురం ఆలయ పునర్నిర్మాణ వీడియోలతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఫైర్
- ఆగమ సలహాదారుల ప్రకారమే పాత ఆలయాన్ని తొలగించామని వెల్లడి
- వైసీపీ పేటీయం బ్యాచ్ మూల్యం చెల్లించుకుంటుందని హెచ్చరిక

వైసీపీ నాయకత్వంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఆలయాలపై దాడులు అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ మేరకు ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ ను సోషల్ మీడియాలో పంచుకున్నారు. రాష్ట్రంలో హిందూ దేవాలయాల విధ్వంసం జరుగుతున్నట్లు వైసీపీ ఫేక్ ముఠా ప్రచారం చేస్తోంది... ఇందులో ఎలాంటి వాస్తవం లేదు... వీటిని నమ్మొద్దు... ప్రజల మధ్య కులం, మతం, ప్రాంతం పేరుతో అలజడి రేపేందుకు యత్నిస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## ఏపీ ప్రజలు ఆందోళన చెందొద్దు

- మన వద్ద గ్యాస్ కొరత లేదు
- భారత్ పై పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావం
- రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదన్న మంత్రి నాదెండ్ల
- బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని అధికారులకు ఆదేశం
- కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలని హెచ్చరిక
- గృహ అవసరాలకే తొలి ప్రాధాన్యత ఇస్తామని స్పష్టీకరణ

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

- వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడ్డ తనను అరెస్ట్ చేశారన్న కవిత
- అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆగ్రహం
- ఇళ్లను కూల్చివేసిన చోటే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలని డిమాండ్



# దాడులు ఉధృతం

- అమెరికాపై ఒత్తిడి పెంచడానికి ఇజ్రాయెల్‌తోపాటు
- గల్ఫ్ దేశాలపై ఇరాన్ క్షిపణుల వర్షం
- జెరూసలేం, టెల్ అవీవ్‌లో పేలుళ్ల మోత
- బహ్రెయిన్ రాజధాని మనామాపై దాడిలో ఒకరి మృతి.. 8 మందికి గాయాలు
- హొర్మూజ్‌లో చమురు రవాణా నౌకలను అడ్డుకుంటున్న ఇరాన్
- ఎక్కడికక్కడే నిలిచిపోయిన నౌకలు
- ఇరాన్ నాయకత్వం నానాటికీ బలహీనపడుతోందన్న నెతన్యాహు

ఉత్తుత్తి బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదన్న ఇరాన్

దుబాయ్: పశ్చి మాసియా యుద్ధం కొత్త మలుపు తిరుగుతోంది. అమెరికాపై ఒత్తిడి పెంచడమే లక్ష్యంగా ఇరాన్ సైన్యం ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్ అరబ్ దేశాలపై దాడులు ఉధృతం చేస్తోంది. యుద్ధం మంగళవారం 11వ రోజుకు చేరుకుంది. బహ్రెయిన్ రాజధాని మనామాపై ఇరాన్ విరుచుకుపడింది. ఓ భవనంపై జరిగిన క్షిపణి దాడిలో ఒక మహిళ(29) మరణించగా, 8 మంది గాయపడ్డారు. ఇరాన్ ప్రయోగించిన రెండు డ్రోన్లను ధ్వంసం చేశామని సౌదీ అరేబియా ప్రకటించింది. ఆరు డ్రోన్లు నేలకూల్చి నట్లు కువైట్ నేషనల్ గార్డు దళం వెల్లడించింది. యూఏఈలో పారిశ్రామిక నగరమైన రువాస్‌పై ఇరాన్ డ్రోన్లు ప్రయోగించింది.

మిగతా 2లో



## ఆరు గ్యారంటీల చట్టబద్ధతకు ప్రైవేట్ బిల్లు

- శాసనసభలో ప్రవేశపెట్టే ఈ బిల్లుకు అధికార పార్టీ మద్దతివ్వాలి: కేటీఆర్
- ప్రభుత్వ పదవీకాలం సగం పూర్తయినా హామీల అమలు జరగట్లేదు
- అసెంబ్లీ కమిటీలు లేకుండానే బలవంతపు సమావేశాలు
- ప్రభుత్వం చేస్తున్న అంకెల గారడీని బయట పెడతాం
- ముగిసిన బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఓరియెంటేషన్ ప్రోగ్రామ్

మిగతా 2లో

హైదరాబాద్: ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలకు మొదటి కేబినెట్ సమావేశంలోనే చట్టబద్ధత కల్పిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు కావొ స్తున్నా అమలు చేయడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ వైఖరిని ఎండగట్టేందుకు

## పుతిన్‌కు ట్రంప్ ఫోన్

**పశ్చిమాసియా సంక్షోభంపై అభిప్రాయాలు పంచుకున్న ఇరువురు నేతలు**

మాస్కో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోమవారం రాత్రి రష్యా అధినేత పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడారు. వారిద్దరి మధ్య దాదాపు గంటపాటు సంభాషణ సాగింది. ఇరాన్‌అమెరికా, క్రెయిన్‌రష్యా సంఘర్షణలపై ఇరువురు నేతలు చర్చించినట్లు

మిగతా 2లో





## కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు

- 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు
- 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలు
- 'తెలంగాణ బ్రాండ్' ప్రతిబింబించేలా ఏర్పాట్లు

హైదరాబాద్: కుంభమేళా తరహాలోనే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని 'గోదావరి పుష్కరాలు 2027' క్యాబినేట్ సబ్ కమిటీ తెలిపింది.మంగళవారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధ్యక్షతన నిర్వహించిన కమిటీ తొలి సమావేశం నిర్వహించింది.సభ్యులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వర రావు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్ రెడ్డి పాల్గొన్నారు.



## వంటగ్యాసే ఫస్టు!

- ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ ఉత్పత్తికి తొలి ప్రాధాన్యం
- వాటికే మొదట సహజ వాయువు సరఫరా
- ఎరువుల తయారీకి ఆరు నెలల సగటులో 70 శాతం సరఫరా
- పారిశ్రామిక వినియోగదారులకు 80%
- గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర ప్రభుత్వం

2లో

## నన్ను ఒక ఉగ్రవాదిలా అరెస్ట్ చేశారు: కవిత

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం జిల్లా వెలుగుమట్ల భూదాన్ భూముల బాధితుల పక్షాన నిలబడి ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారు. నిరాహార దీక్షకు దిగిన తనను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేసి హైదరాబాద్‌కు తరలించడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం పేదల కోసం గళమెత్తిన తనను ఒక ఉగ్రవాదిలా భావించి అరెస్ట్ చేశారని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదల పట్ల కనికరం లేకుండా వ్యవహరిస్తోందని ఆమె మండిపడ్డారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన కవిత, వెలుగుమట్లలో పేదలు కష్టపడి కట్టుకున్న ఇళ్లను అధికారులు కర్కశంగా కూల్చివేసిన తీరును తప్పుబట్టారు. భూదాన్ భూములు అంటేనే పేదలకు ఇచ్చేవి అని, కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆ భూములను పెద్దలకు కట్టబెట్టేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతోందని ఆరోపించారు. కూల్చివేసిన చోటే మళ్లీ ఇళ్లను నిర్మించి బాధితులకు న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

## ఏపీ ప్రజలు ఆందోళన చెందొద్దు... మన వద్ద గ్యాస్ కొరత లేదు

రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ సిలిండర్ల కొరత లేదని, ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. గృహ, వాణిజ్య అవసరాలకు సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయని, సరఫరాలో ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేవని ఆయన భరోసా ఇచ్చారు. అంతర్జాతీయంగా నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో, రాష్ట్రంలో ఎల్పీజీ నిల్వలు, సరఫరాపై మంత్రి మంగళవారం ఉన్నతాధికారులతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కీలక సమయంలో గ్యాస్‌ను అక్రమంగా బ్లాక్ మార్కెట్‌కు తరలించకుండా జిల్లా జాయింట్ కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కృత్రిమ కొరత సృష్టించడం, ఇష్టానుసారం ధరలు పెంచడం వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గృహ అవసరాలకు గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది రాకుండా చూడటమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత అని మంత్రి తెలిపారు. అవసరమైతే, వాణిజ్య అవసరాలకు ప్రాధాన్యత క్రమంలో సరఫరా చేస్తామన్నారు. రోజువారీ నిల్వల్లో ఏమాత్రం తేడా వచ్చినా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధంగా ఉన్నాయని, సరఫరా వ్యవస్థను పూర్తి అప్రమత్తంగా ఉంచాలని అధికారులకు సూచించారు.

## దాడులు ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. మరోవైపు బాంబులు, సైరన్ల మోతతో ఇజ్రాయెల్ దద్దరిల్లింది. జెరూసలేం, టెల్ అవీవ్‌లో భారీగా పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. ఇరాన్ ప్రయోగించిన కొన్ని క్షిపణులను ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ మధ్యలోనే అడ్డుకుంది. మరికొన్ని క్షిపణులు లక్ష్యాలను తాకినట్లు తెలుస్తోంది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై వైమానిక దాడులు చేశామని ఇజ్రాయెల్ వెల్లడించింది. టెహ్రాన్‌లో పెద్ద ఎత్తున పేలుళ్ల శబ్దాలు వినిపించాయి. తమవైపు దూసుకొచ్చిన ఇరాన్ మిస్సైళ్లను తుత్తునియలు చేశామని ఖతార్ రక్షణ శాఖ తెలియజేసింది. ఇజ్రాయెల్‌తోపాటు గల్ఫ్‌లో అమెరికా సైనిక స్థావరాలపై కేవలం మిస్సైళ్లు, డ్రోన్ల దాడులతో సరిపెట్టకుండా హొర్మూజ్ జలసంధిపై ఇరాన్ ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. ఇక్కడ చమురు రవాణా నౌకలను అడ్డుకుంటోంది. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలకు రెక్కలొస్తున్నాయి. ధరలు పెరిగేకొద్దీ అమెరికా, ఇజ్రాయెల్‌పై ప్రపంచ దేశాల నుంచి ఒత్తిడి పెరగడం తథ్యమని, ఫలితంగా ఆ రెండు దేశాలు యుద్ధాన్ని ఆపాల్సిన అనివార్య పరిస్థితి ఏర్పడుతుందని ఇరాన్ అంచనా వేస్తోంది. ముడి చమురు బ్యారెల్ ధర 90 డాలర్లు దాటేసింది. ఫిబ్రవరి 28 నాటి ధరతో పోలిస్తే ఇది 24 శాతం అధికం. హొర్మూజ్‌లో చమురు రవాణా నౌకలపై ఇప్పటిదాకా జరిగిన దాడుల్లో ఏడుగురు నావికులు మరణించారు. మంగళవారం పర్షియన్ గల్ఫ్‌లో యూఏఈ తీరంలో చమురు రవాణా నౌకపై దాడి జరిగినట్లు సమాచారం. ఇరాన్ అండదండలతో దాడులకు తెగబడుతున్న హెజ్‌బోల్లా మిలిటెంట్లపై ఇజ్రాయెల్ సైన్యం గురిపెట్టింది. లెబనాన్‌లోని హెజ్‌బొల్లా స్థావరాలపై క్షిపణులు వర్షం కురిపించింది. ఈ ఘటనలో కనీసం ఐదుగురు మిలిటెంట్లు హతం కాగా, నలుగురు గాయపడినట్లు తెలిసింది. ఇళ్లను ఖాళీ చేసి సురక్షిత ప్రాంతాలకు వెళ్లిపోవాలని దక్షిణ లెబనాన్ ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం సూచించింది. హెచ్‌బొల్లాపై భీకర దాడులు చేయడానికి ఇజ్రాయెల్ సన్నద్ధమైంది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్‌లో ఇప్పటివరకు 1,230 మంది మరణించారు. లెబనాన్‌లో 397 మంది, ఇజ్రాయెల్‌లో 11 మంది మృతిచెందారు. అలాగే ఏడుగురు అమెరికా జవాన్లు ప్రాణాలు కోల్పోయారు. యుద్ధాన్ని ముగించడానికి తమ వంతు సహకారం అందిస్తామని, మధ్యవర్తిత్వానికి సిద్ధంగా ఉన్నా మని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ తెలిపారు. ఈ అవకాశం ఉపయోగించుకోవాలని ఇరాన్, ఇజ్రాయెల్అమెరికాలకు సూచించారు. ఇరాన్‌పై అత్యంత భీకర దాడులు చేయబోతున్నామని అమెరికా రక్షణ శాఖ మంత్రి పీట్ హెగ్సెత్ తేల్చి చెప్పారు. ఈరోజే ఈ దాడులు జరుగబోతున్నాయని మంగళవారం ప్రకటించారు. ఇరాన్‌పై గరిష్ట సంఖ్యలో ఆయుధాలు ప్రయోగిస్తామన్నారు. ఇరాన్ సైన్యం గత 24 గంటల్లో స్వల్పంగానే క్షిపణులు ప్రయోగించిందని తెలిపారు. ఇరాన్ ఆయుధ బలం క్షీణిస్తోందని తెలిపారు.

## పుతిన్‌కు ట్రంప్ ఫోన్

(మొదటి పేజీ తరువాయి)

రష్యా విదేశాంగ విధాన ప్రతినిధి యూరీ ఉషకోవ్ వెల్లడించారు. ప్రధానంగా పశ్చిమాసియా సంక్షోభంతోపాటు ఉక్రెయిన్‌లో శాంతి సాధన కోసం కొనసాగుతున్న మాస్కోవాషింగ్టన్‌కీవ్ చర్చలపై అభిప్రాయాలు పంచుకున్నట్లు తెలిపారు. ట్రంప్, పుతిన్ మధ్య సంభాషణ స్వేచ్ఛాయుతంగా, నిర్మాణాత్మకంగా జరిగిందని పేర్కొన్నారు. ఇరాన్‌లో జరుగుతున్న యుద్ధం పట్ల పుతిన్ తన అభిప్రాయాలు వ్యక్తంచేశారని, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్‌తోపాటు గల్ఫ్ దేశాల నాయకులతో గతవారం జరిగిన చర్చల సారాంశాన్ని ట్రంప్‌కు పుతిన్ తెలియజేశారని చెప్పారు. ట్రంప్ సైతం తాజా పరిణామాలపై తన మనసులో మాటను పుతిన్‌తో పంచుకున్నారని స్పష్టంచేశారు. ఈ ఏడాది ట్రంప్, పుతిన్ ఫోన్‌లో మాట్లాడుకోవడం ఇది 11వ సారి కావడం విశేషం. భారత్, చైనాలతోపాటు యూరప్‌లోని మిత్రదేశాలకు చమురు సరఫరాను పునరుద్ధరించడానికి సిద్ధంగా ఉన్నామని పుతిన్ తాజాగా ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే ఆయనతో ట్రంప్ ఫోన్‌లో మాట్లాడడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు



(మొదటి పేజీ తరువాయి)

'తెలంగాణ బ్రాండ్' మార్మోగేలా... మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని సంబంధిత అధికారులను కమిటీ ఆదేశించింది. పుష్కర నిర్వహణ తేదీలు, సంబంధిత శాఖల సన్నద్ధత, భవిష్యత్తు కార్యాచరణను సమీక్షించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం మంత్రులు మాట్లాడుతూ.... సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలు, సమ్మక్క సారక్క జాతరను అత్యంత వైభవోపేతంగా నిర్వహించిందన్నారు. అదే స్ఫూర్తితో... మరింత రెట్టించిన ఉత్సాహంతో రాబోయే గోదావరి పుష్కరాలనూ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు ఆది పుష్కరాలు, 2028 జూలై 13 నుంచి 24 వరకు అంత్య పుష్కరాలను నిర్వహించాలని వేద పండితులు నిర్ణయించారన్నారు. సుమారు 8 కోట్ల మంది భక్తులు ఈ పుష్కరాలకు తరలి వచ్చే అవకాశముందని, అందుకు అనుగుణంగానే గోదావరి ప్రవహించే జిల్లాల్లో... ప్రముఖ దేవాలయాలను అనుసంధానిస్తూ... 96 ప్రాంతాలను పుష్కరాల కోసం ప్రత్యేకంగా ఎంపిక చేశామన్నారు. గత పుష్కరాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఆయా చోట్ల క్షేత్రస్థాయి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా ఘాట్లు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల అభివృద్ధికి రాష్ట్ర, జిల్లా ప్రణాళికలను ప్రత్యేకంగా రూపొందిస్తున్నామన్నారు. తొలి దశలో భాగంగా యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు రద్దీ అధికంగా ఉండే తొమ్మిది ప్రాంతాలను 'టైర్ 1' కింద ఎంపిక చేశామన్నారు. సమన్వయలోపం తలెత్తకుండా గోదావరి పుష్కరాల నిర్వహణకు ప్రత్యేకంగా స్పెషల్ ఆఫీసర్, శాఖల వారీగా నోడల్ అధికారులను నియమిస్తామన్నారు. ప్రతి ఘాట్ దగ్గర ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, ఎమర్జెన్సీ రూట్, అత్యాధునిక వైద్య సౌకర్యాలు, పార్కింగ్ తదితర అంశాలపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అత్యంత పకడ్బందీగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించారు.

## ఆరు గ్యారంటీల చట్టబద్ధతకు ప్రైవేట్ బిల్లు

సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో బీఆర్ఎస్ ప్రవేశపెట్టే ప్రైవేట్ మెంబరు బిల్లుకు అధికార పార్టీ మద్దతు ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ నగర శివారులోని గోల్కొండ రిసార్టులో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు సంయుక్తంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమం ముగిసిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న మూడో వార్షిక బడ్జెట్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ప్రభుత్వ పదవీకాలం సగం పూర్తయినా హామీల అమలు జరగడం లేదు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ హామీల వైఫల్యం, మోసాన్ని ఎండగట్టేందుకు అసెంబ్లీలో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించాం. రెండేళ్లుగా అసెంబ్లీ కమిటీలు లేకుండానే ప్రభుత్వం సమావేశాలను బలవంతంగా నడిపిస్తోంది. పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ పదవిని మా పార్టీకి ద్రోహం చేసి వెళ్లిన వ్యక్తికి ఇచ్చారు. సెలెక్ట్, స్టాండింగ్, పిటిషన్స్ తదితర 14 అసెంబ్లీ కమిటీలు పెండింగ్‌లో ఉన్నాయి. డిప్యూటీ స్పీకర్, చీఫ్‌విప్ లాంటి పదవులు భర్తీ చేయకుండా మందబలంలో బుల్డోజర్ టాక్టిక్స్‌ను ప్రభుత్వం ప్రయోగిస్తోంది. అసెంబ్లీ ఉభయ సభల్లో అబద్ధాలు, అసత్యాలతో అంకెలను తారుమారు చేస్తూ తూతూమంత్రంగా సమావే శాలు నిర్వహిస్తోంది'అని కేటీఆర్ మండిపడ్డారు. 'ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి అసెంబ్లీలో నాటకాలు ఆడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బలంగా నిలదీయడానికే అవగాహన సమావేశాలు బీఆర్ఎస్ ఏర్పాటు చేసింది. రైతుబంధు, ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఇళ్ల కూల్చివేత, మూసీ బాధితులు తదితర అంశాలతోపాటు ప్రజలకు ఇచ్చిన హామీలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం. అసెంబ్లీలో ప్రభుత్వం చేస్తున్న అంకెల గారడీని, లేని అప్పులను ఉన్నవిగా చూపిస్తున్న కాంగ్రెస్ అబద్ధాలను అంకెలతో సహా ఎండగడతాం. భవిష్యత్‌లోనూ బీఆర్ఎస్ శాసన మండలి, శాసనసభ సభ్యుల నడుమ మా పార్టీ సమన్వయం కోసం మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తుంది. ఆరు గ్యారంటీలు, హామీల అమలుకు నిధులు లేవని చెబుతున్న ప్రభుత్వం మూసీ ప్రక్షాళన పేరిట భారీ అవినీతికి తెరలేపింది. మేము సుందరీకరణకు కాకుండా దాని పేరిట జరుగుతున్న అవినీతిని వ్యతిరేకిస్తున్నాం. ఢిల్లీకి నిధులు పంపేందుకే రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును చేపడుతున్నాడు. రేవంత్‌రెడ్డి చెబుతున్న మాటలకు ఎంత మాత్రం విలువ లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పట్టపగలు నాశనం చేసిన సీఎం 'నైట్ ఎకానమీ'గురించి మాట్లాడుతున్నాడు. రేవంత్‌రెడ్డి పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారింది. రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ఒక్క ఇళ్లు కట్టినా నేను రాజీనామా చేస్తాను అని చేసిన ప్రకటనకు కట్టుబడి ఉన్నా. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన ఇళ్లు, ఫ్లైఓవర్లు, ప్రాజెక్టులకు రంగులు పూసి రేవంత్ తమ ఘనతగా చెప్పుకుంటున్నాడు'అని కేటీఆర్ విమర్శించారు.

## వంటగ్యాసే ఫస్టు!

న్యూఢిల్లీ: పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా గల్ఫ్ దేశాల నుంచి ముడి చమురు, సహజ వాయువు దిగుమతుల్లో ఆటంకాలు ఎదురవుతున్నాయి. దేశంలో వంట గ్యాస్ సరఫరా తగ్గుతుండడం ఆందోళన కలిగిస్తోంది. గృహ వినియోగానికి ప్రస్తుతం ఇబ్బందులు లేకపోయినా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరా తగినంత లేకపోవడంతో ప్రధాన నగరాల్లో హోటళ్లు మూతపడుతున్నాయి. రవాణా రంగానికి అవసరమైన గ్యాస్ సరఫరా నిలిచిపోతోంది. సమస్య పరిష్కారంపై కేంద్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. దేశీయంగా ఉత్పత్తి అయ్యే సహజ వాయువును ప్రాధాన్యతా క్రమంలో సరఫరా చేయాలని ఆదేశించింది. మొదట ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ తయారీకి, తర్వాత ఎరువుల ఉత్పత్తికి, అనంతరం తేయాకు పరిశ్రమ, పారిశ్రామిక వినియోగదారులకు, ఆ తర్వాత సిటీ గ్యాస్ సరఫరాదారులకు సహజ వాయువును సరఫరా చేయాలని పేర్కొంది. ఈ మేరకు సోమవారం రాత్రి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ గ్యాస్‌ను మొదట ద్రవీకృత పెట్రోలియం గ్యాస్(ఎల్పీజీ), కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్(సీఎన్‌జీ), పైప్డ్ నేచురల్ గ్యాస్(పీఎన్‌జీ) తయారీకి అందజేయాలని తేల్చిచెప్పింది. ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ ఉత్పత్తిలో సహజ వాయువును ముడి సరుకుగా ఉపయోగిస్తారు. ముడి చమురు శుద్ధి ప్రక్రియలో ఒక ఉపఉత్పత్తి ఎల్పీజీ. అలాగే సహజ వాయువును ప్రాసెస్ చేయడం ద్వారా ఎల్పీజీని తయారు చేస్తారు. కేంద్ర ప్రభుత్వ నోటిఫికేషన్ ప్రకారం.. మొదట ఎల్పీజీ, సీఎన్‌జీ, పీఎన్‌జీ తయారీకి ప్రాధాన్యం ఇస్తూ సహజ వాయువును సరఫరా చేయాల్సి ఉంటుంది. ఆయా రంగాల్లో గత ఆరునెలల సగటు వినియోగాన్ని పరిగణనలోకి తీసుకొని అందులో 100 శాతం సరఫరా చేయాలి.

## అది ఫేక్ ప్రచారం... వాటిని నమ్మొద్దు

(మొదటి పేజీ తరువాయి)

"అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణం సందర్భంగా తీసిన వీడియోలతో ఫేక్ ప్రచారం చేస్తున్నారు. దేవాలయ గర్భాలయం, విమానగోపురం, అర్థ మండపం రాతి నిర్మాణపు పనులు 60 శాతం పూర్తయ్యాయి. దేవస్థానం వైదిక కమిటీ సభ్యుల తీర్మానం ప్రకారం, ఆగమ సలహాదారుల సూచనల మేరకు ఫిబ్రవరి 28న శాస్త్రోక్తంగా పాత ఆలయాన్ని తొలగించారు. ఫేక్ ప్రచారం చేస్తున్న వైసీపీ పేటియం బ్యాచ్ తగిన మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఈ విషయంలో రాష్ట్ర ప్రజలు నిజానిజాలు తెలుసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ నారా లోకేశ్ ట్వీట్ చేశారు.

## 'ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజిక్ మెటీరియల్ హబ్'గా ఏపీ

(మొదటి పేజీ తరువాయి)

ఊపునివ్వాలని సూచించారు. మంగళవారం సచివాలయంలో గనుల శాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 'ఆంధ్రప్రదేశ్ టైటానియం, స్ట్రాటజిక్ మెటీరియల్స్ మిషన్ (ఆప్రా-టూవీవీ)' ఏర్పాటు, పెట్టుబడుల ఆకర్షణ వంటి కీలక అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ మిషన్ ద్వారా రాబోయే పదేళ్లలో రూ.50,000 కోట్ల పెట్టుబడులు ఆకర్షించడంతో పాటు, 40,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యం కావాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం వనరులను వెలికితీయడమే కాకుండా, వాటికి విలువ జోడించడం (వాల్యూ ఎడిషన్)పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. రేర్ మినరల్స్ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలన్నారు. రాష్ట్రంలోని వనరులపై పూర్తి అవగాహన పెంచుకోవడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా, రాష్ట్రంలోని తీరప్రాంతంలో లభించే బీచ్ సాండ్ మినరల్స్ దేశంలోనే అత్యంత విలువైనవని అధికారులు సీఎంకు వివరించారు. వీటిలో ప్రధానంగా ఇల్మెనైట్, రుటైల్, జిర్కాన్, మోనాజైట్, గార్నెట్, సిల్లిమనైట్ వంటి వ్యూహాత్మక ప్రాధాన్యమున్న ఖనిజాలు ఉన్నట్లు తెలిపారు. ఈ బీచ్ సాండ్ మినరల్స్ నుంచి వచ్చే ఉత్పత్తులు పెయింట్స్, కాస్మెటిక్స్, ఫార్మా రంగాలతో పాటు ఏరోస్పేస్, రక్షణ, శస్త్రచికిత్స పరికరాలు, సెరామిక్స్, ఎలక్ట్రానిక్స్, అణు ఇంధనం, అణు రియాక్టర్ల విడిభాగాల తయారీ వంటి అత్యంత కీలకమైన పరిశ్రమలకు అవసరమని అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఖనిజ సంపదను సమర్థంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలో మూడు ముఖ్యమైన ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేయాలని అధికారులు ప్రతిపాదించారు. శ్రీకాకుళంలో టైటానియం పార్క్ (ఏడాదికి 15 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం), అనకాపల్లిలో రేర్ ఎర్త్ కారిడార్ (ఏడాదికి 25,000 టన్నుల ఉత్పత్తి లక్ష్యం), మచిలీపట్నంలో సమగ్ర టైటానియం, రేర్ ఎర్త్ కారిడార్‌లను ఏర్పాటు చేయాలని తమ ప్రతిపాదనలను సీఎం ముందుంచారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, గనులు, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పాలనపై సీఎం చంద్రబాబు ఫోకస్...

రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల అమలును వేగవంతం చేసే లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సమావేశానికి సిద్ధమయ్యారు. ఈ నెల 11, 12 తేదీల్లో రెండు రోజుల పాటు అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు ముఖాముఖి సమీక్షలు జరిపి, పరిపాలన యంత్రాంగానికి స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు. సచివాలయంలోని ఐదో బ్లాకులో జరిగే ఈ సదస్సు మొదటి రోజు ఉదయం 10 గంటలకు సీసీఎల్ఏ స్వాగత ప్రసంగంతో మొదలవుతుంది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఉప ముఖ్యమంత్రి, మంత్రుల ప్రసంగాల అనంతరం ఉదయం 10:30 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకోపన్యాసం చేస్తారు. అనంతరం "స్వర్ణాంధ్ర ఏ2047" విజన్‌లో భాగంగా నిర్దేశించుకున్న పది సూత్రాల అమలుపై చర్చిస్తారు. పేదరిక నిర్మూలన, జల భద్రత, వ్యవసాయంలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై సమీక్షిస్తారు. రాష్ట్ర జీఎస్‌డీపీ వృద్ధి రేటు, జిల్లాల వారీగా సాధించిన ప్రగతిపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకుంటారు.



## శ్రీవారి కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

- 15న బాలాజీ రామకృష్ణాలయంలో వేడుక
- ఆహ్వాన పత్రికను ఆవిష్కరించిన చైర్‌పర్సన్ పావని

**చౌటుప్పల్, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ బాలాజీ రామకృష్ణ దేవాలయంలో నిర్వహించనున్న శ్రీ అలివేలుమంగ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవ ఆహ్వాన పత్రికను మున్సిపల్ చైర్‌పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. స్వామివారి కళ్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చి కళ్యాణోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- నాగార్జున పాఠశాలలో విద్యార్థులకు అవగాహన..
- అగ్నిమాపక యంత్రాల పనితీరు ప్రదర్శన




**రామన్నపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రామన్నపేట మండల కేంద్రంలోని నాగార్జున స్కూల్‌లో మంగళవారం అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఆందోళన చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అధికారులు విద్యార్థులకు వివరించారు. పెట్రోల్ పంపుల్లో మంటలు చెలరేగినప్పుడు వాటర్ కాకుండా ఇసుక, కార్బన్ డై ఆక్సైడ్, ఫోమ్ ద్వారా మంటలను అదుపులోకి తీసుకువస్తారని తెలిపారు. భవనాల్లో అగ్ని ప్రమాదం జరిగినప్పుడు దట్టమైన పొగ కారణంగా ఆక్సిజన్ అందక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని పేర్కొన్నారు. అలాంటి పరిస్థితుల్లో చేతి రుమాలను ముఖానికి కట్టుకుని నేలపై ప్రాకుతూ బయటకు రావాలని సూచించారు. అలాగే ఫైర్ ఇంజన్‌లో ఉండే వాటర్ ఫిల్లింగ్ విధానం, ఇతర అగ్నిమాపక ఉపకరణాలను ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు ప్రాయోగికంగా వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరెస్పాండెంట్ డాక్టర్ నాగరాజు ఎన్, ఫైర్ స్టేషన్ ఆఫీసర్ మధుసూధన్ రెడ్డి, లీడింగ్ ఫైర్ ఫైటర్ ఆర్. భీకు, డ్రైవర్ కాశీరాం, ఫైర్ ఫైటర్లు జే. వెంకటేశ్వర్లు, సిచ్. మధు, పాఠశాల బోధన సిబ్బంది పాల్గొన్నారు.

## నేతన్న బతుకు 'చిద్రం'.. అప్పుల ఊబిలో బలవన్మరణం

- ఈఎంఐలు కట్టలేక పురుగుల మందు తాగిన బాలరాజు..
- కుటుంబంలో తీరని శోకం



**రామన్నపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి గ్రామానికి చెందిన చేనేత కార్మికుడు ఆర్థిక ఇబ్బందులతో పురుగులమందు తాగి మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారండ వెల్లంకి గ్రామానికి చెందిన మిర్యాల బాలరాజు (39), చేనేత పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఐదు సంవత్సరాల క్రితం భువనగిరిలోని ఓ ఫైనాన్స్ కంపెనీ నుండి చేనేత పనుల కోసం రూ.3 లక్షల 50 వేల రూపాయలు అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీసుకున్న అనంతరం ప్రతి నెలా ఈఎంఐలు చెల్లిస్తూ వచ్చాడు. అయితే గత రెండు నెలలుగా చేనేత పని సరిగా లేకపోవడంతో ఈఎంఐలు చెల్లించలేకపోయాడు. దీనితో మనస్తాపానికి గురైన బాలరాజు మంగళవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై మృతుడి భార్య మిర్యాల అంజలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ హౌస్ ఆఫీసర్ డి. నాగరాజు తెలిపారు.

## ఘాట్ రోడ్డు పనులను వేగవంతం చేయాలి

- నాణ్యతతో కూడిన నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ ఆదేశం..
- యాదగిరిగుట్టలో ఘాట్ రోడ్డు పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

**యాదగిరిగుట్ట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్టలో దేవస్థానం కోసం కొండపైకి వెళ్లేందుకు నిర్మిస్తున్న ఎంట్రీ ఫ్లైఓవర్, ఘాట్ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ బి అధికారులతో కలిసి జరుగుతున్న పనుల పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. ప్రస్తుతం పనులు ఏ దశలో ఉన్నాయో సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. భక్తులు సురక్షితంగా ప్రయాణించేలా ఘాట్ రోడ్డు పనులను సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి సూచించారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి శాఖ అధికారి సరితతో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# రామన్నపేట ఆసుపత్రిని 100 పడకలుగా మార్చాలి

- 16 నుంచి సీపీఎం నిరవధిక దీక్షలు..
- బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించాలని అఖిలపక్షం డిమాండ్



**రామన్నపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి, రాబోయే రాష్ట్ర బడ్జెట్‌లో రూ. 40 కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించాలని సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 16 నుండి నిరవధిక నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య తెలిపారు. స్థానిక రామన్నపేట రహదారిలోని బంగ్లాలో అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి నిరాహార దీక్షల కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సుమారు 60 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిసర మండలాల ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నప్పటికీ ప్రస్తుతం అనేక సమస్యలతో సతమతమవుతోందని పేర్కొన్నారు. రోజుకు సుమారు 400 మంది అవుట్ పేషెంట్లు ఆసుపత్రికి వస్తున్నప్పటికీ తగినంత మంది వైద్యులు లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నాణ్యమైన వైద్య సేవలు అందక పేద ప్రజలు దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి అనేకసార్లు తీసుకెళ్లినప్పటికీ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి తర్వాత వాటిని అమలు చేయడంలో విఫలమవుతున్నారని అన్నారు. ఏరియా ఆసుపత్రి బోర్డు పెట్టి 15 సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ 30 పడకలకే పరిమితమైందని తెలిపారు. రాబోయే బడ్జెట్ సమావేశాల్లో రామన్నపేట ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, లేనిపక్షంలో మండల వ్యాప్తంగా ప్రజలను సమీకరించి ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఎం పార్టీ మండల కార్యదర్శి, మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీడీపీ మండల నాయకుడు ఫజల్ బేగ్, సీపీఐ మండల నాయకుడు రచ్చ యాదగిరి, ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడు నోముల చిరంజీవి, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, మండల కమిటీ సభ్యులు గొరిగే సోములు, గన్నెబోయిన విజయభాస్కర్, ఎండీ రషీద్, బావండ్లపల్లి బాలరాజు, బోడిగె రజిత, పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆవనగంటి స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివకుమార్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, పల్లె సత్యం, మేడి గణేష్, ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రామచంద్రం, శాఖ కార్యదర్శులు గోగు లింగస్వామి, శానగొండ వెంకటేశ్వర్లు, పెండెం బ్రహ్మయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## నారసింహుడికి కాసుల వర్షం..



- 28 రోజులకు గాను లెక్కింపు..
- హుండీలో రూ 1.86 కోట్ల సిరులు..
- 57 గ్రాముల బంగారం, 2.7 కిలోల వెండి సమర్పణ
- పలు దేశాల కరెన్సీ సమర్పించిన భక్తులు

**యాదగిరిగుట్ట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. సత్యనారాయణ వ్రత మండపం - 2లో నిర్వహించిన 28 రోజుల హుండీ లెక్కింపులో మొత్తం సుమారు రూ. 1,86,44,511 ఆదాయం వచ్చినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు. అలాగే భక్తులు సమర్పించిన బంగారం సుమారు 57.500 గ్రాములు, వెండి సుమారు 2.750 కిలోలుగా నమోదైనట్లు వెల్లడించారు. అంతేకాకుండా అమెరికా, ఇంగ్లాండ్, వియత్నాం, నేపాల్, కెనడా, ఆస్ట్రేలియా, హాంకాంగ్, ఇండోనేషియా, మలేషియా, బ్రెజిల్, యూరప్, దక్షిణాఫ్రికా తదితర దేశాల కరెన్సీలు కూడా హుండీలో లభించినట్లు అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ భవాని శంకర్, డీఈఓ దొర్భాల భాస్కర్ శర్మ, అధికారులు సురేందర్ రెడ్డి, రఘు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో ప్రతిభ చూపితే.. సైకిల్ బహుమతి!



- 200 మంది విద్యార్థులకు అందజేస్తామన్న డీఈవో సత్యనారాయణ..
- రాజపేటలో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కందుల సత్యనారాయణ హాజరై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా పరీక్షలను ధైర్యంగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ఆకాంక్షించారు. జిల్లా కలెక్టర్ సూచన మేరకు జిల్లాలో ఉత్తమ ఫలితాలు సాధించిన 200 మంది విద్యార్థులకు సైకిళ్లు బహుమతిగా అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోయ మధు గౌరవ అతిథిగా పాల్గొన్నారు. గతంలో ప్రకటించినట్లుగా తన గౌరవ వేతనాన్ని విద్య, వైద్యం కోసం వినియోగిస్తానని పేర్కొంటూ విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందజేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ నెమిల కేదారి తదితరులు పాల్గొన్నారు.




## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లను రాజాపేట సర్పంచ్ కోయ మధు అందజేశారు. సర్పంచ్ కోయ మధు తన గౌరవ వేతనాన్ని ఉపయోగించి సుమారు 100 మంది విద్యార్థులకు ప్యాడ్లను కొనుగోలు చేసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పాఠశాల భవిష్యత్తుకు తోడ్పడే విధంగా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ముఖ్యమని పేర్కొన్నారు.





## సోమారం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జంపయ్యగౌడ్

- నియామక పత్రాన్ని అందజేసిన మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** ఆలేరు నియోజకవర్గం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆదేశాల మేరకు రాజాపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నెమీలి మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమారం గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా బొమ్మకంటి జంపయ్య గౌడ్‌ను నియమించారు. మంగళవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బొమ్మకంటి జంపయ్య గౌడ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి గ్రామ శాఖ అధ్యక్షుడి బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు, మండల పార్టీ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నెమీలి మహేందర్ గౌడ్, కిసాన్ సెల్ రాష్ట్ర కార్యదర్శి బుడిగ పెంటయ్య గౌడ్, అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఇంజి నరేష్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాంజీ నాయక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విటల్ నాయక్, సిల్వర్ బాలరాజ్ గౌడ్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రంగా నరేష్ గౌడ్, దూది వెంకటపురం సర్పంచ్ నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మెండు భాస్కర్ రెడ్డి, గొలుసుల యాకూబ్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బల్ల యాదేశ్, రఘునాథ్‌పురం గ్రామ శాఖ అధ్యక్షుడు బింగి రమేష్, పార్టీ నాయకులు గిరిరాజు స్వామి, గిరిరాజు ఆంజనేయులు, బూడిద సురేష్ పాల్గొన్నారు.

## బడిలో 'బాలల' రాజ్యం!

- అధికారులుగా మారిన చిన్నారులు..
- కలెక్టరుగా శ్రీనిజ, మంత్రిగా వినయార్జున సందడి

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రాజపేటలోని హరిజనవాడ పాఠశాలలో మంగళవారం స్వపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులే ఉపాధ్యాయులు, అధికారులుగా మారి తమ తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడిగా కొత్త అశ్విన్ కుమార్, విద్యాశాఖ మంత్రిగా ఎర్రగోకుల వినయార్జున, కలెక్టర్‌గా బుగ్గ గాయత్రి శ్రీనిజ, డీఈఓగా చిట్టి యతిష్య, ఎంపీడీవోగా ఎర్రగోకుల శ్రీ నేహా, ఎంఈఓగా భూక్య లోకేష్ విధులు నిర్వర్తించారు. అలాగే ప్రవళిక, దీక్షిత, సాత్విక్, యాకూబ్, షమిత్, అభిరామ్, చంద్రకళ, హర్షిత, ప్రశాంతి, హర్ష, సృజనిక, సంజన శ్రీ, దీపిక, లోహిత్, వర్షిత్, శ్రీహర్ష, విశ్వతేజ్, శివానంద్, జాన్ వెస్లీ, అనూష, ప్రణీత్ తదితరులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. కార్యక్రమంలో రాజపేట కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తడక రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకుల భాస్కర్, ఉపాధ్యాయులు వనమాల రామలింగాచారి, నమిల శ్రీమతి పాల్గొన్నారు.





## పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

- చల్లూరులో ప్రారంభించిన పశువైద్య అధికారులు..
- వ్యాధి నిరోధకతపై అవగాహన

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రాజపేట మండలం చల్లూరులో మంగళవారం పశువైద్య, పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. పశువులకు ఈ వ్యాధి సోకకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని పశువైద్యులు పశుపోషకులకు సూచించారు. డాక్టర్ కటకం భాస్కర్, ఎల్ఎస్ఏ రాజు పర్యవేక్షణలో పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ భీమగాని రూప బాలనరసయ్య గౌడ్, ఉప సర్పంచ్ బొంత సుధాకర్ తదితరులు పాల్గొని పశుపోషకులకు వ్యాధి నిరోధకతపై పలు సూచనలు అందించారు. పశువైద్యులు, సరైన ఆహారం, పరిశుభ్రత, తగిన వ్యాక్సినేషన్ పద్ధతులు పాటించడం ద్వారా పశువుల ఆరోగ్యాన్ని నిర్ధారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమం పశుపోషకుల్లో ఆసక్తి కలిగిస్తూ, ముందస్తు జాగ్రత్తల వల్ల పశువుల జబ్బుల తీవ్రత తగ్గుతుందని అధికారులు తెలిపారు.

## నేడు గాంధీభవన్‌లో ఆదివాసి కాంగ్రెస్ విస్తృత స్థాయి భేటీ

- తరలిరావాలని ఎస్టీ సెల్ జిల్లా చైర్మన్ రాంజీ నాయక్ పిలుపు..
- చేవెళ్ల డిక్లరేషన్ అమలుపై చర్చ



**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** తెలంగాణ ఆదివాసి కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 11న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో నిర్వహించనున్నట్లు యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్టీ సెల్ చైర్మన్ రాంజీ నాయక్ చౌహాన్ తెలిపారు. మంగళవారం రాజపేటలో మీడియాతో మాట్లాడుతూ.. ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఉదయం 10:30 గంటలకు ఈ సమావేశం జరుగుతుందని చెప్పారు. రాష్ట్రంలోని 621 మండలాల నుంచి ప్రతి మండలం నుండి ఐదుగురు ఆదివాసి కాంగ్రెస్ కార్యకర్తలు సమావేశంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు, ఇంకా మిగిలిన హామీలపై ఈ సమావేశంలో చర్చించి పార్టీ అధిష్టానానికి నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆల్ ఇండియా ఆదివాసి కాంగ్రెస్ చైర్మన్ విక్రాంత్ బూర్య, తెలంగాణ కాంగ్రెస్ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సీతక్క తదితరులు పాల్గొననున్నారని చెప్పారు. యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ అధ్యక్షులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని జిల్లా చైర్మన్ రాంజీ నాయక్ చౌహాన్ కోరారు.

## ప్రజా పాలన.. ప్రగతికి బాట!

- 99 రోజుల ప్రణాళికతో ముందడుగు..
- ఉగాదికి ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశాలు: కలెక్టర్ చంద్రశేఖర్

**నకిరేకల్, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 రోజుల "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు నల్గొండ జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కార్యక్రమం తొలి 15 రోజులు పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీల్లో పరిశుభ్రత పనులు పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఉగాది నాటికి తుది దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పూర్తి చేసి సామూహిక గృహప్రవేశాలు నిర్వహించాలని తెలిపారు. పాఠశాలలు, హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డంపింగ్ యార్డులు, ప్రకృతి వనాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ.. గత రెండేళ్లలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు మరింత చేరువ చేయడమే ఈ 99 రోజుల ప్రణాళిక లక్ష్యమని తెలిపారు. సన్నబియ్యం పంపిణీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలు విజయవంతంగా కొనసాగుతున్నాయని చెప్పారు. నకిరేకల్ పట్టణంలో త్వరలోనే 100 పడకల ఆసుపత్రిని ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. గంజాయి రహిత నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు యువత సహకరించాలని కోరారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణపై పలు సూచనలు చేశారు. జిల్లాలో జరిగిన ప్రమాద మరణాల్లో 90 శాతం హెల్మెట్ ధరించకపోవడం వల్లే జరుగుతున్నాయని, ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. 2023లో 59గా ఉన్న ప్రమాదకర ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) 2025 నాటికి 31కి తగ్గించామని తెలిపారు. గంజాయి సంబంధిత సమాచారం తెలిసిన వారు వెంటనే 8712670266 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.








# ప్రభుత్వ బడి.. ప్రగతికి పొడి!

- అక్షర సమాజ నిర్మాణమే లక్ష్యం కావాలి
- ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులను చేర్పించాలి
- సర్పంచుల సమావేశంలో డీఈవో కందుల సత్యనారాయణ

**రాజపేట, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** అక్షర సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈవో) కందుల సత్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం రాజపేట మండల కేంద్రంలోని ఎంఆర్సీ కార్యాలయంలో మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో సర్పంచులు, ప్రధానోపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాధికారి చంద రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించేందుకు సర్పంచులు ప్రత్యేకంగా కృషి చేయాలని కోరారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామస్థాయి నాయకులు ముందుండాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, యూనిఫారాలు, మధ్యాహ్న భోజనం, వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నందున తల్లిదండ్రులు ఈ అవకాశాలను వినియోగించుకోవాలని తెలిపారు. పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి డబ్బులు వృథా చేసుకోవద్దని, ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించి చదువుపై దృష్టి పెట్టేలా తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని సూచించారు. తరగతికొక ఉపాధ్యాయుడు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. చిన్ననాటి నుంచే నైతిక విలువలు బోధిస్తే సమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని అన్నారు. ప్రతి పాఠశాల భౌతిక మౌలిక వసతులతో కళకళలాడేలా యువ సర్పంచులు కృషి చేయాలని, విద్య ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచులు రంగా నరేష్, పల్లె సంతోష్, కోయ మధు, చింతల సంపత్, ఎం. జ్యోతి, జి. అనూష, ఎన్. నరేష్ తదితరులు మాట్లాడారు. మండలంలోని 20 మంది సర్పంచులు పాల్గొన్నారు. ఇటీవల ఎన్నికైన సర్పంచులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తడక రాజు, కె. మనోజ్ కుమార్, ఎస్. విజయలక్ష్మి, ఎం. శ్రీనివాస్ రెడ్డి, జే. ప్రభాకర్, జి. కోటిరెడ్డి, ఎల్. రవీందర్ రెడ్డి, టి. ఉమామహేశ్వర్, జి. శోభ, బి. వసంత, కే. కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సర్పంచులకు గౌరవంగా శాలువాలతో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నమిల భరత్ కుమార్ పాడిన బడిబాట పాటలు సభను ఆకట్టుకున్నాయి.




# మునుగోడు నీటి గోస తీరేదెన్నడు?

- ప్రాజెక్టులు పూర్తి చేయకపోతే పోరాటమే!
- పెండింగ్ ప్రాజెక్టుల కోసం పోరుబాట..
- ఫ్లోరైడ్ రక్కసిపై భాస్కర్ ధ్వజం
- మునుగోడు నీటి సమస్యలపై భాస్కర్ అల్టిమేటం..
- రిటైర్డ్ ఇంజనీర్లతో సమీక్ష
- రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకం కావాలి : ఇఎల్‌వి భాస్కర్

**మునుగోడు/చౌటుప్పల్, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** మునుగోడు నియోజకవర్గంతో పాటు నల్గొండ జిల్లాలో దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న సాగు, త్రాగునీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఇఎల్‌వి భాస్కర్ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి రాజకీయాలకు అతీతంగా అందరూ ఏకమవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఇంద్రసేనారెడ్డిని భాస్కర్ కలిసి మునుగోడు ప్రాంతంలో నెలకొన్న సాగునీటి, త్రాగునీటి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న డిండి ఎత్తిపోతల పథకం, కృష్ణారాంపల్లి, శివన్నగూడెం ప్రాజెక్టుల



నిర్మాణాలను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టుల సాధన కోసం అన్ని రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలతో కలిసి పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. మునుగోడు ప్రాంతంలో భూగర్భ జలాలు ఫ్లోరైడ్‌తో కలుషితమై ఉండటంతో ప్రజలు తీవ్రమైన ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి వనరుల లేమితో రైతులు పంటలు సాగు చేయలేకపోతున్నారని, పండించినా గిట్టుబాటు ధరలు లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఫ్లోరైడ్ కలిగిన నీటితో



పండించే పంటలు ఆరోగ్యానికి ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.

# డబుల్ బెడ్రూం ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

- సింగన్నగూడెంలో కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ..
- లబ్ధిదారులకు త్వరగా అందజేయాలని ఆదేశం

**యాదాద్రి భువనగిరి, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** పెండింగ్‌లో ఉన్న 2బీహెచ్‌కే (డబుల్ బెడ్‌రూమ్) ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. మంగళవారం భువనగిరి మండలంలోని సింగన్నగూడెంలో నిర్మాణంలో ఉన్న డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇండ్ల నిర్మాణ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద ఇంకా ఏ పనులు పెండింగ్‌లో ఉన్నాయో, ప్రస్తుతం జరుగుతున్న పనులు ఏ దశలో ఉన్నాయో, మిగిలిన పనులు ఎప్పటివరకు పూర్తి చేస్తారో సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభించని పనులపై



కారణాలు కూడా తెలుసుకుని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. అన్ని పనులను వేగవంతం చేసి ఇండ్లను త్వరగా లబ్ధిదారులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏడి శ్రీరాములు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# ప్రజాప్రతినిధులకు 12న శిక్షణ

- ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై అవగాహన..
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశం
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ రామకృష్ణ రావు



**యాదాద్రి భువనగిరి, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 12న సర్పంచులు, మున్సిపల్ వార్డు సభ్యులు, చైర్మన్లు, మేయర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ రావు ఆదేశించారు. జూన్ 12 వరకు నిర్వహించే 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా కొత్తగా ఎన్నికైన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు నిర్వహించనున్న శిక్షణా కార్యక్రమంపై మంగళవారం జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు, కౌన్సిలర్లు పాలనపై అవగాహన పెంపొందించుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని తెలిపారు. ఈనెల 12న నిర్వహించే శిక్షణా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటికే కార్యక్రమాల షెడ్యూల్ రూపొందించామని, దాని ప్రకారం జూన్ 12 వరకు నిర్వహించే అన్ని కార్యక్రమాలను విజయవంతం చేయడానికి జిల్లాల అధికార యంత్రాంగం సన్నద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 12న ప్రజాపాలనప్రగతి ప్రణాళికపై ప్రజాప్రతినిధులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే ఈ శిక్షణ తరగతుల్లో పది అంశాలపై వివరంగా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జడ్పీ సీఈఓ శోభారాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, డీఎంహెచ్ఓ మనోహర్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# భూ నిర్వాసితుల నష్టపరిహారం పెంచాలి

- పరిహారం ప్రకటించే వరకు భూ సర్వేకు అడ్డుకట్ట



**వలిగొండ, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** గౌరెల్లి నుండి భద్రాచలం వరకు సుమారు 189 కిలోమీటర్ల మేర నిర్మించనున్న జాతీయ రహదారి కోసం భూ సర్వే చేయడానికి వచ్చిన అధికారులను వలిగొండ మండలంలోని ఎదుల్లగూడెం, మల్లేపల్లి, దాసిరెడ్డిగూడెం, సంగెం గ్రామాల రైతులు అడ్డుకున్నారు. ముందుగా నష్టపరిహారం పెంచి ప్రకటించిన తర్వాతే భూ సర్వే చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రైతు మలుగ రవీందర్ మాట్లాడుతూ.. ట్రిబుల్ ఆర్ బాధితులకు ఏ విధంగా నష్టపరిహారం చెల్లించారో తమకూ అదే విధంగా పరిహారం ఇవ్వాలని కోరారు. తమ జీవనాధారం అయిన సాగుభూములను కోల్పోతున్న నేపథ్యంలో తగిన పరిహారం ఇవ్వకుండానే అధికారులు భూ సర్వేకు రావడం సరైంది కాదని ఆయన పేర్కొన్నారు. పండే భూమిని కోల్పోతే తమ కుటుంబాల జీవనోపాధి ప్రమాదంలో పడుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ముందస్తు సమాచారం లేకుండానే అధికారులు సర్వే చేయడానికి రావడాన్ని వారు తీవ్రంగా అభ్యంతరం తెలిపారు. అనంతరం అక్కడికి వచ్చిన తహసీల్దార్ రైతులతో మాట్లాడి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ, నష్టపరిహారం పెంచి ప్రకటించే వరకు సర్వేకు అనుమతించబోమని రైతులు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాపోలు గోపి, దేవరపల్లి భూపాల్ రెడ్డి, మల్గ వెంకటేష్, నారీ రమేష్, రావుల సంజీవరెడ్డి, భీమిడి మల్లారెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.



# ఆడబిడ్డల అభ్యున్నతే ధ్యేయం!

- మహిళా సాధికారతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- పుట్టపర్తి వరకు త్వరలో ఆర్టీసీ బస్సు సౌకర్యం
- గార్మెంట్స్ మహిళా కార్మికులతో కలిసి వేడుకలు
- 1600 మంది మహిళలకు కానుకల పంపిణీ చేసిన మంత్రి సవిత





**అనంతపురం / గోరంట్ల, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** మహిళల అభ్యున్నతి, సాధికారతకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి సవిత పేర్కొన్నారు. గోరంట్ల మండల కేంద్రంలోని ఇండియన్ డిజైన్ గార్మెంట్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గార్మెంట్స్‌లో పనిచేస్తున్న మహిళలతో కలిసి మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అనంతరం సంస్థ యాజమాన్యంతో కలిసి గార్మెంట్స్ పరిశ్రమను పరిశీలించారు. కార్యక్రమంలో మాట్లాడిన మంత్రి సవిత, మహిళల అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుతున్నామని ఆమె పేర్కొన్నారు. దీపం పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1.08 కోట్ల కుటుంబాలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్నామని, సంవత్సరానికి మూడు సిలిండర్లు ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. "తల్లికి వందనం" పథకం ద్వారా రాష్ట్రంలోని సుమారు 67 లక్షల మంది విద్యార్థులకు రూ.10 వేల కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. శ్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఆర్థిక భారం తగ్గి ప్రయాణ స్వేచ్ఛ కల్పించబడిందన్నారు. ఈ సందర్భంగా గార్మెంట్స్‌లో పనిచేస్తున్న 1600 మంది మహిళలకు మహిళా దినోత్సవ కానుకగా గిఫ్ట్ బాక్స్‌లను మంత్రి సవిత పంపిణీ చేశారు. కరోనా వంటి క్లిష్ట సమయంలో కూడా పరిశ్రమను మూసివేయకుండా కొనసాగించిన యాజమాన్యాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. త్వరలో గార్మెంట్స్ పరిశ్రమ నుంచి పుట్టపర్తి వరకు మహిళలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గతంలో ఎన్నడూ జరగని విధంగా నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేస్తామని ఆమె చెప్పారు. ప్రతి ఆడబిడ్డకు 14 సంవత్సరాల లోపు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని మహిళలకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో ఇండియన్ డిజైన్ గార్మెంట్స్ యాజమాన్యం, గోరంట్ల మండల కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.



# కారు ఢీకొని బీహార్ కార్మికుడి మృతి

**చౌటుప్పల్, మార్చి 10 (తొలివెలుగు న్యూస్) :** రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని కారు ఢీకొన్న ఘటనలో ఓ కార్మికుడు ప్రాణాలు కోల్పోయాడు. పోలీసుల కథనం ప్రకారం.. బీహార్‌కు చెందిన శంకర్ సహ్నీ (25), తూప్రాన్‌పేట్‌లోని సాయి వికాస్ క్యాస్టింగ్ కంపెనీలో కూలీగా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి 8 గంటల సమయంలో నిత్యావసర సరుకుల కోసం కిరాణా దుకాణానికి వెళ్లాడు. తిరిగి వస్తుండగా విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గుర్తుతెలియని కారు అతివేగంగా వచ్చి అతడిని ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన శంకర్‌ను హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి స్నేహితుడు సతీష్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథ కుమార్ తెలిపారు.

# కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 1 వరకు అవకాశం
- ఆన్‌లైన్ ద్వారానే స్వీకరణ: ప్రిన్సిపాల్ నిర్మల

**కుందుర్పి, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) 202627 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైనట్లు కుందుర్పి మండల కేజీబీవీ ప్రిన్సిపాల్ నిర్మల తెలిపారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్లు మంగళవారం వెల్లడించారు. కేజీబీవీలో 6వ తరగతిలో 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆమె తెలిపారు. అదేవిధంగా 7, 8, 9, 10 తరగతులు మరియు ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి కూడా ఏప్రిల్ 1 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు.

**దరఖాస్తు విధానం:**

దరఖాస్తులు కేవలం ఆన్‌లైన్ ద్వారా మాత్రమే స్వీకరించబడతాయని, ఆఫ్‌లైన్ దరఖాస్తులు తీసుకోబోమని ప్రిన్సిపాల్ నిర్మల స్పష్టం చేశారు. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ https://apkgbv.apcfss.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

**ఎంపిక ప్రక్రియ:**

ఏప్రిల్ 13వ తేదీన ఎంపికైన విద్యార్థుల జాబితా విడుదల చేస్తారు. అనంతరం ఏప్రిల్ 13 నుంచి 17వ తేదీ వరకు సంబంధిత విద్యాలయాల్లో ధృవపత్రాల పరిశీలన నిర్వహించి, తరగతుల వారీగా సీట్లు కేటాయిస్తారని ఆమె తెలిపారు.




# అసమానతలపై పోరాడిన అసాధ్యురాలు!

- అక్షరజ్యోతి సావిత్రిబాయికి ఘన నివాళి
- మహిళలు, చిన్నారుల విద్యకు కల్పతరువు
- ఘనంగా సావిత్రిబాయి పూలే వర్ధంతి వేడుకలు

**వలిగొండ, మార్చి 10 (తొలివెలుగు న్యూస్):** భారతదేశంలో బాలికల విద్యకు పునాది వేసిన తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా వలిగొండ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఘనంగా నివాళులు అర్పించారు. బీసీ సంఘం నాయకుడు సాయిని యాదగిరి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిని యాదగిరి మాట్లాడుతూ.. భారత సామాజిక సంస్కరణల చరిత్రలో సావిత్రిబాయి పూలే గొప్ప స్థానం సంపాదించుకున్న మహనీయురాలని పేర్కొన్నారు. మహిళల విద్యకు మార్గదర్శకురాలిగా, సామాజిక సమానత్వం కోసం పోరాడిన సంస్కర్తగా ఆమె పేరు చరిత్రలో చిరస్థాయిగా నిలిచిందన్నారు. ప్రతి సంవత్సరం మార్చి 10న ఆమె వర్ధంతిని దేశవ్యాప్తంగా ఘనంగా స్మరించుకుంటారని తెలిపారు. సావిత్రిబాయి పూలే కేవలం ఉపాధ్యాయురాలే కాకుండా మహిళల హక్కులు, దళితుల అభివృద్ధి కోసం నిరంతరం



పోరాడిన మహనీయురాలని అన్నారు. సమాజంలో ఉన్న అంధవిశ్వాసాలు, కుల వివక్ష, లింగ అసమానతలను వ్యతిరేకిస్తూ అనేక ఉద్యమాలు చేపట్టారని పేర్కొన్నారు. బాల్య వివాహాలు, వరకట్న వ్యవస్థ వంటి చెడు ఆచారాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన కల్పించడంలో ఆమె కీలక పాత్ర పోషించారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఉద్యమకారుడు శీలం స్వామి, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు పెరమండ్ల యాదగిరి, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పల్లెర్ల రామచందర్, రైతు సంఘం నాయకులు యాస రంగారెడ్డి, కామ్రేడ్ కొండూరు సత్తయ్య, మస్కు నరసింహ, బీఎస్పీ జిల్లా నాయకుడు పాలేర్ల నరేష్, బీసీ నాయకులు మెరుగు వెంకటేశం, దాసరి లింగస్వామి, రాపోలు పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# చిచ్చు పెట్టొద్దు





బాలీవుడ్‌హీరోయిన్లు యామీ గౌతమీ, కృతి సనన్‌మధ్య సోషల్‌మీడియా వేదికగా వివాదం తలెత్తింది. ఇటీవల జరిగిన 'జీ సినీ అవార్డ్స్' వేడుకలో ఉత్తమ నటిగా అవార్డు అందుకున్న కృతి సనన్ ఫొటోను యామీ గౌతమీ లైక్‌చేసింది. అయితే దీనిపై నెట్టింట పెద్ద దుమారమే రేపింది. ఈ వివాదం మరింత ముదురుతుండటంతో తాజాగా యామీ గౌతమీ క్లారిటీ ఇచ్చింది. 'నేను మరో నటిని తక్కువ చేసే విధంగా ఉన్న రీల్‌ను లైక్ చేశానని నా దృష్టికి వచ్చింది. నిజానికి ప్రతిరోజూ మమ్మల్ని వందలాది పోస్టుల్లో ట్యాగ్ చేస్తూ ఉంటారు. అవార్డు ఫంక్షన్ హడావిడిలో పొరపాటున ఆ వీడియోపై క్లిక్ అయి ఉండవచ్చు. అంతే తప్ప కావాలని చేసింది మాత్రం కాదు. నా కెరీర్‌లో ఎప్పుడూ ఇలాంటి చీప్ టెక్నిక్స్ వాడలేదు. నాకు అసలు పీఆర్ టీమే లేదు. అవార్డుల విషయంలో నా ఒపీనియన్ ఏంటో ఇప్పటికే చాలాసార్లు చెప్పేశాను. నేను ఎవరి మెప్పుకోసమే, గుర్తింపు కోసమో పనిచేయడం లేదు. నా పని మీద మాత్రమే నాకు నమ్మకం ఉంది. సోషల్ మీడియాలో వచ్చే గాసిప్స్ నమ్మవద్దు. క్లిక్‌బైట్ వార్తల కోసం గౌరవప్రదమైన నటీమణుల మధ్య చిచ్చు పెట్టొద్దు' అంటూ గౌతమీ వివరణ ఇచ్చింది.

# చిరంజీవికి ఎన్టీఆర్ పురస్కారం, కమల్ హాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు

తెలుగు చలనచిత్ర రంగంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఇచ్చే ప్రతిష్టాత్మక 'గద్దర్ అవార్డుల' (2025) విజేతల జాబితా శనివారం అధికారికంగా విడుదలైంది. ఈ ఏడాది అత్యున్నత పురస్కారాల్లో భాగంగా చిత్రసీమకు చెందిన ఇద్దరు దిగ్గజ నటులకు అరుదైన గౌరవం దక్కింది. తెలుగు సినిమాకు మెగాస్టార్ చిరంజీవి అందించిన అసమానమైన సేవలకు గుర్తింపుగా ఆయనను ప్రతిష్టాత్మకమైన 'ఎన్టీఆర్ జాతీయ పురస్కారం'తో ప్రభుత్వం సత్కరించనుంది. అలాగే వెండితెరపై తన విలక్షణ నటనతో కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్న లోకనాయకుడు కమల్ హాసన్‌ను 'పైడి జయరాజ్ అవార్డు' వరించింది. ప్రముఖ దర్శక నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ స్పెషల్ జ్యూరీ అవార్డుల వివరాలను ప్రకటించారు. 2025 జనవరి 1 నుండి డిసెంబర్ 31 వరకు సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలు, షార్ట్ ఫిల్మ్‌ల నుండి ఈ ఎంపిక జరిగింది. ఈ ప్రతిష్టాత్మక జాబితాలో నటి జయసుధకు 'ఏఎన్నార్ పురస్కారం', ప్రముఖ నిర్మాత అశ్విని దత్‌కు 'నాగిరెడ్డి చక్రపాణి అవార్డు', గేయ రచయిత సుద్దాల అశోక్ తేజకు 'సినారే అవార్డు' దక్కాయి. ఈ పురస్కారాలను ఈ నెల మార్చి 19న ఉగాది పర్వదినం సందర్భంగా అత్యంత వైభవంగా ప్రదానం చేయనున్నారు.




# వెంకటేష్– అనిల్ రావిపూడి కాంబోలో మరో చిత్రం.



టాలీవుడ్‌లో విజయవంతమైన కాంబినేషన్‌లలో ఒకటిగా నిలిచిన విక్టరీ వెంకటేష్ అనిల్ రావిపూడి జోడీ మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇప్పటికే పలు విజయవంతమైన చిత్రాలను అందించిన ఈ కాంబినేషన్‌లో ఐదో సినిమాకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌కు వెంకటేష్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వచ్చిన ఎఫ్2,ఎఫ్ 3వంటి చిత్రాలు భారీ విజయాన్ని సాధించాయి. అలాగే సంక్రాంతికి వస్తున్నాం, మన శంకర వరప్రసాద్ గారు వంటి చిత్రాలు కూడా ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ఇప్పుడు అదే జోష్‌తో మరో ఎంటర్‌టైనింగ్ ప్రాజెక్ట్‌ను తెరకెక్కించేందుకు దర్శకుడు అనిల్ రావిపూడి స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారు. ఈ చిత్రంలో ప్రత్యేక ఆకర్షణగా నందమూరి కళ్యాణ్ రామ్ ఒక కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. ఆయన పాత్ర కథలో కీలక మలుపు తిప్పేలా ఉంటుందని తెలుస్తోంది. వెంకటేష్ కళ్యాణ్ రామ్ కాంబినేషన్ ప్రేక్షకుల్లో ఇప్పటికే ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇక ఈ సినిమాలో వెంకటేష్ సరసన హీరోయిన్‌గా కీర్తి సురేష్ నటించనున్నట్లు తెలుస్తోంది. మహానటి చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన కీర్తి సురేష్ ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంతకం చేసినట్లు సమాచారం. అయితే కళ్యాణ్ రామ్‌కు జోడీగా నటించే హీరోయిన్ ఎంపిక ఇంకా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రానికి సంగీతాన్ని భీమ్స్ సిసిరోలియో అందించనుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను సమీర్ రెడ్డి చేపట్టనున్నారు. నిర్మాణ బాధ్యతలను షైన్ స్క్రీన్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్వహించనున్నాయి. ప్రస్తుతం వెంకటేష్ నటిస్తున్న సినిమా పూర్తికాగానే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది. జూన్ నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుపెట్టేలా ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సంక్రాంతి సెంటిమెంట్‌ను కొనసాగిస్తూ ఈ చిత్రాన్ని 2027 సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ భావిస్తున్నారు. అనిల్ రావిపూడి ప్రత్యేకమైన కామెడీ స్టైల్, వెంకటేష్ టైమింగ్ కామెడీకి తోడు కళ్యాణ్ రామ్ పాత్ర కూడా ఆసక్తికరంగా ఉండనుండటంతో ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి.

# స్పెషల్ ఈవెంట్



'అమిగోస్' మూవీతో టాలీవుడ్ లోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ కస్తూరీ ఆషికా రంగనాథ్.. ఫస్ట్‌సినిమాతోనే తెలుగు ప్రేక్షకుల మనసులను కొల్లగొట్టింది. ఆతర్వాత 'నా సామిరంగా' తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది ఈ అందాల భామ. ఈ సంక్రాంతికి 'భర్త మహాశయులకు విజ్ఞప్తి' చిత్రంతో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ప్రస్తుతం 'విశ్వంభర'తోపాటు 'సర్దార్ 2' వంటి భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది. ఇక సోషల్ మీడియాలో యాక్టీవ్ గా ఉండే ఈ బ్యూటీ.. తాజాగా 'ఫర్ ఏ వెరీ స్పెషల్ ఈవెంట్' అంటూ కొన్ని ఫొటోలని ఇన్‌స్టాగ్రామ్ లో పోస్ట్ చేసింది. చేతిలో తెల్లని గులాబీ, ముక్కుకు ముక్కెరతో గుండె గిల్లుతున్న ఈ అందాల భామ లేటెస్ట్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ అవుతోంది. లెహంగాలో మెరిసిపోతున్న ఆషికా అందానికి నెటిజన్లు ఫిదా అవుతున్నారు.'అందమైన గులాబీ సంథింగ్ అమ్మడూ' అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.